క్లుప్తంగా

నేడు విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈనెల 9న వరంగల్ దేశాయిపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు ఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్ ఎన్వీ.వేణుగోపాల చారి తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. ఈ లోకల్ కోర్టుకు విద్యుత్ వినియోగదారులు హాజరై ఫిర్యాదులందించి సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

నేటి నుంచి ఉచిత వైద్య శిబిరం

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో సోమవారం నుంచి ఈనెల 20వ తేదీ వరకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మెడికవర్ యాజమాన్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. 3,500 విలువైన ఆర్‌బీఎస్ (షుగర్ టెస్ట్), ఈసీజీ, యూరిన్ షుగర్, ఎక్స్ రే, ఫల్మనరీ ఫంక్షన్ టెస్ట్ (పీఎఫ్‌టీ), డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా అందించనున్నట్లు పేర్కొంది. రోజు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందని వివరించింది.

11న భగవద్గీత శ్లోకాల పోటీలు

హన్మకొండ కల్చరల్: ఈనెల 11న గీతాజయంతిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శ్రీమద్ భగవద్గీతలోని ఆరో అధ్యాయం ఆత్మ సంయమయోగం శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ డీపీపీ కార్యక్రమ నిర్వహణ బాధ్యుడు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. హనుమకొండలోని నక్కలగుట్ట ఎస్ఎంఆర్ హైస్కూల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆరు, ఏడో తరగతుల విద్యార్థులను మొదటి గ్రూపుగా, ఎనిమిది, తొమ్మిదో తరగతుల వారిని రెండో గ్రూపుగా, 18 ఏళ్ల వయస్సు గల వారిని మరో గ్రూపుగా విభజించి పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

దివ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాల పరిశోధకురాలు శ్రీపాద దివ్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. సింథసిస్ అండ్ సీఎన్ఎస్ యాక్టివిటీ ఆఫ్ న్యూ ఇండోల్ డెరివేటివ్స్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి దివ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ సారంగపాణి పర్యవేక్షణలో దివ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

'క్లాట్'లో శ్రీజాతవేద ప్రతిభ



హన్మకొండ అర్బన్: హనుమకొండలోని శ్రీనివాసకాలనీకి చెందిన ఎన్నమనేని శ్రీనివాసరావు – కవిత దంపతుల కుమార్తె శ్రీజాతవేద.. జాతీయ స్థాయిలో ప్రముఖ న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే కామన్ లా అడ్మిషన్ టెస్ట్ (క్లాట్) ఎంట్రెన్స్ పరీక్షలో ఆల్ ఇండియా 362వ ర్యాంకు సాధించింది. ఈ మేరకు శ్రీజాతవేదను పలువురు అభినందించారు.

యూత్ కాంగ్రెస్ కార్యదర్శిగా ముస్తాక్ నేహాల్



హన్మకొండ చౌరస్తా: యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా హనుమకొండకు చెందిన మహమ్మద్ ముస్తాక్ నేహాల్ ఎన్నికయ్యారు. ఇటీవల ఆన్‌లైన్ పద్ధతిలో యూత్ కాంగ్రెస్ ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. నేహాల్ గతంలో యూత్ కాంగ్రెస్ 58వ డివిజన్ అధ్యక్షుడిగా, పశ్చిమ అసెంబ్లీ కార్యదర్శిగా, ప్రస్తుతం పీసీసీ సోషల్ మీడియా కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

ఇస్రో ట్యూటర్‌కు సన్మానం



హన్మకొండ చౌరస్తా: ఇస్రో ట్యూటర్‌గా ఎంపికైన భూపతి శశాంక్‌ను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం సన్మానించారు. చిన్న వయస్సులో ప్రపంచ ఖ్యాతి పొందిన ఇస్రో శాస్త్ర విభాగంలో ట్యూటర్‌గా ఎంపికవడం హనుమకొండకే గర్వకారణమని నాయిని ప్రశంసించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాసరావు, శశాంక్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

సభ్యులకు అండగా ఉంటా

హసన్‌పర్తి: సంఘంలోని ప్రతీ సభ్యుడికి అండగా ఉంటానని భద్రకాళి పరపతి సంఘం అధ్యక్షుడు నాగమళ్ల సుధీర్ అన్నారు. సంఘం 13వ వార్షికోత్సవ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాల్లో సభ్యులు భాగస్వాములు కావాలని సూచించారు. పరపతి సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడానికి ప్రణాళిక రూపొందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రమోద్, కోశాధికారి గౌరిశెట్టి వెంకటేశ్వర్లు, సభ్యులు డాక్టర్‌చారి, గౌరిశెట్టి కృష్ణమూర్తి, పాడి గణపతిరెడ్డి, చకిలం చంద్రశేఖర్, దీకొండ భిక్షపతి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం @ ఏకశిల పార్కు

- కనువిందు చేస్తున్న ఖిలా వరంగల్ కోటలోని పచ్చని చెట్లు
- పిల్లల కోసం ఆధునిక ఆట పరికరాలు
- సెలవు రోజుల్లో భారీ సంఖ్యలో తరలివస్తున్న పర్యాటకులు
- మరింత అభివృద్ధి చేయాలని కోరుతున్న సందర్శకులు



చిల్డ్రన్స్ పార్కులో ఆడుకుంటున్న విద్యార్థులు



బోటులో విహరిస్తున్న పర్యాటకులు



పచ్చని చెట్ల మధ్యలో పార్కు అందాలు

ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన ఖిలా వరంగల్ మధ్యకోటలో కుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకశిల చిల్డ్రన్స్ పార్కు సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. పలు రకాల పూలమొక్కలు, పచ్చని చెట్లు, పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన వివిధ రకాల పరికరాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పందొమ్మిదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ పార్కులో ఆదివారం, సెలవు దినాల్లో పిల్లలు, విద్యార్థులు, యువతీ, యువకులు, ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఎక్కువ సంఖ్యలో వస్తుంటారు. ప్రశాంతమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన ఈ పార్కులో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు. పార్కు సమీపంలో ఇటీవల సుమారు 22 ఎకరాల భూసేకరణ చేపట్టారు. పార్కును విస్తరిస్తే ఉదయం వాకింగ్ చేసేందుకు వీలుంటుంది. ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు పార్కు తెరిచే ఉంటోంది.

చెరువును అభివృద్ధి చేయాలి

నాడు కాకతీయ రాజులకు తాగునీరు అందించిన గుండు చెరువు.. నేడు బురదమేటతో నిండి ఉంది. చెరువులో పూడికతీసి గోదావరి నీటితో నింపితే పర్యాటకులను మరింత కనువిందు చేయనుంది. అంతేకాకుండా మూడు కోటల్లో నివసించే 25వేల మంది ప్రజలకు నిరంతరం తాగునీరు కూడా అందించవచ్చని ఇంజనీర్లు చెబుతున్నారు. భారీ వర్షాల చెరువు నిండినప్పటికీ బురద, మురుగునీటితో చెరువు కళ విహీనంగా దర్శనమిస్తోంది.

ఏకశిల గుట్టపై దేవుడి విగ్రహం ఏది?

వరంగల్ నగరానికే వన్నెతెచ్చిన ఏకశిల గుట్ట విశిష్టతను కోల్పోతోంది. గుట్టపై అందమైన గుడి ఉన్నట్లే కాని గర్భగుడిలో దేవుడి విగ్రహం లేదు. స్వామివారిని దర్శనం చేసుకుని నగర అందాలను తిలకించాలనుకునే పర్యాటకులను నిరాశపరుస్తోంది. ఏకశిల గుట్టపై అద్భుతం శిల్పకళా సంపదతో ఉట్టిపడుతున్న ఆలయంలో రాముడు లేదా శివుడి విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రుద్రమదేవి విగ్రహాన్ని వెలికితీయాలి

చారిత్రక నేపథ్యం ఉన్న గుండు చెరువు మధ్యలో ఎత్తైన బండరాయిపై ఏర్పాటు చేసిన వీరనారి రాణి రుద్రమదేవి విగ్రహం బురద నీటిలో పడిపోయింది. గతేడాది ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షాలతో గుర్రం కాలు విరిగి విగ్రహం నీటిలో పడిపోయింది. ఇంత వరకు దాన్ని వెలికి తీయలేదు.

పార్కును అభివృద్ధి చేయాలి



ఆధునిక హంగులతో ఏకశిల చిల్డ్రన్స్ పార్కును మరింతగా అభివృద్ధి చేయాలి. ఏకశిల కొండ, ఆ పక్కన చెరువు కట్టమీద ఉన్న పార్కు అందరిని ఆకట్టుకుంటోంది. కాలానికి అనుగుణంగా అధునాతనమైన, విశాలమైన పార్కుగా అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగనుంది. గుండు చెరువులో పడిపోయిన రుద్రమదేవి విగ్రహాన్ని వెలికితీయాలి.

– బి.శివాజీ, మధ్యకోట

ఆదివారం వస్తే పార్కులోనే..



ఆదివారం, సెలవు దినాల్లో పార్కు సందర్శకులతో కళకళలాడుతూ ఉంటుంది. పల్లె వాతావరణం ఉంటే కోటలో చెట్ల నీడన కుటుంబ సమేతంగా సేదదీరుతుంటారు. ఏకశిల పార్కు పిల్లలకు ఆహ్లాదం అందిస్తోంది. సెలవు రోజుల్లో పిల్లలతో కలిసి కుటుంబ సమేతంగా పార్కులో మేము రోజంతా సంతోషంగా గడుపుతుంటాం.

– కె.మాధురి రెడ్డి, రంగశాయిపేట, వరంగల్

14నుంచి మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వేదిక బాధ్యులు

విద్యారణ్యపురి: ఈనెల 14, 15వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లా కేంద్రంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు వేదిక ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ బాధ్యులు తెలిపారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ సెంటర్‌లో కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర బాధ్యుడు బాదావత్ రాజు మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం పెచ్చుమీరి పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని, సహజ వనరులను దోచుకునేందుకు అటవీప్రాంతాల్లో నివసించే ఆదివాసీల హక్కులను కాలరాస్తున్నారని వాపోయారు. మహా సభలకు ఉమ్మడి వరంగల్ ప్రాంతంలోని విద్యార్థులు, మేధావులు, ప్రజాతంత్ర వాదులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శి హరికృష్ణ, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆదునూరి యాదగిరి, ప్రధాన కార్యదర్శి దిలీప్, ఉపాధ్యక్షురాలు పద్మజ, సహాయ కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో బైక్ మాయం.. కాజీపేటలో చక్కర్లు



కాజీపేటలో తిరుగుతున్న చోరీకి గురైన బైక్

కాజీపేట: జమ్మికుంట ప్రాంతంలో మాయమైన ఓ ద్విచక్ర వాహనం కాజీపేట పట్టణంలో తిరుగుతుండగా తరచూ ట్రాఫిక్ చలాన్లు పడుతున్నాయి. జమ్మికుంట పట్టణానికి చెందిన ఇనుగాల శ్రావణ్ కుమార్‌కు చెందిన ఏపీ 15బీఎస్ 6622 నంబర్ గల వాహనం ఏడాది క్రితం రైల్వే స్టేషన్ పార్కింగ్ స్థలం నుంచి చోరీకి గురైంది. ఈమేరకు బాధితుడు జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే ఆ ద్విచక్ర వాహనం రెండు నెలలుగా కాజీపేట పట్టణంలో తిరుగుతుండగా వరుసగా ఈ–చలాన్లు పడుతున్నాయి. ఒకే వ్యక్తి ఆ బైక్‌పై నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్నట్లు శ్రావణ్‌కుమార్ సెల్‌ఫోన్‌కు చలాన్ల మెసేజ్‌లు వస్తున్నాయి. దాంతో కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

బెదిరించిన వ్యక్తిపై కేసు

ఖిలా వరంగల్: ఈ ఇల్లు తనదని ఇంటిలో నుంచి వెళ్లి పోవాలని కుటుంబ సభ్యులను బెదిరించి, ఇంట్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన కేసులో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. వరంగల్ శంభునిపేటకు చెందిన కేసిపెద్ది రామేశ్వర్ రాజు, వరలక్ష్మి దంపతులు 1990లో 300 గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలంలో రేకులతో ఇంటి నిర్మాణం చేసి నివాసముంటున్నారు. ఆ స్థలం తనదని, ఇల్లు ఖాళీ చేసి వెళ్లాలని వరలక్ష్మిని ఈనెల 6న సాయంత్రం సూరం నిఖిల్ బెదిరించాడు. రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి పారిపోయాడు. బాధితురాలు వరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

కాలేజీ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

వరంగల్: వరంగల్ జిల్లా కాలేజీ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ (ఆర్‌సీటీఏ) కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.మల్లారెడ్డి తెలిపారు. హనుమకొండలోని ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా పులి సారంగపాణి, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ బి.వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ బి.మల్లారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా బి.రాజయ్య, సంయుక్త కార్యదర్శులుగా జిన్నా ప్రభాకర్‌రెడ్డి, బి.కృష్ణమూర్తితో పాటు మరో 20మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు సీహెచ్.విద్యాసాగర్‌రావు, బి.సత్యనారాయణ, అతిథులుగా డాక్టర్ టీ.సుధాకర్‌రెడ్డి, డాక్టర్ అంపశయ్య నవీన్ పాల్గొన్నట్లు మల్లారెడ్డి తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారని ఆయన అన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ



వేదికపై పడిపూజ నిర్వహిస్తున్న గురుస్వాములు

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు సుభాష్‌నగర్‌లోని నాగేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో ఆదివారం అయ్యప్పస్వామి మహా పడిపూజను నిర్వహించారు. అయ్యప్ప మహా పడిపూజ 21వ సంవత్సరాన్ని పురస్కరించుకుని నాగమయ్య అయ్యప్ప కుటీరం ప్రతినిధి బత్తిని సుభాష్‌గౌడ్ భక్త బృందం ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన పూజారులు జాగుర్లపూడి కోటయ్య శర్మ, శ్రీరామ్‌శర్మ నేతృత్వంలో భారీ వేదికపై పదినెట్టాంబడిపై ప్రతిష్ఠించిన స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ పూజకు భారీ సంఖ్యలో హాజరైన అయ్యప్ప మాలధారుల శరణుఘోషతో ఆ ప్రాంతం మార్మోగింది. పూజలో మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్లు పోశాల పద్మ, గుండు చందన, మరుపల్లి రవి, ఆలయ ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మాలధారులకు అన్నదానం

రామన్నపేట: నగరంలోని ఆంధ్ర బాలిక కళాశాల ఆవరణలో హరిహరపుత్ర అయ్యప్పస్వామి అన్నదాన సేవా సమితి, భక్త బృందం ఆధ్వర్యంలో గురుస్వామి పుల్లూరు విశ్వం జ్ఞాపకార్థం ఆదివారం మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు అర్చకుడు, గురుస్వామి పవనారాధ్య తెలిపారు.

గురుకుల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం వీడాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని గురుకులాల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం వీడాలని బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు గురుకుల బాట కార్యక్రమాన్ని నవంబర్ 30నుంచి డిసెంబర్ 5వరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్వీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకుల బాట కార్యక్రమంలో అనేక గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీల్లో పలు సమస్యలు నెలకొని ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, గంధ్రకోట రాకేష్‌యాదవ్, పిల్లల నాగరాజు, గొల్లపెల్లి వీరస్వామి, వస్తం అనిల్, రాయనూరి రాజేష్, రత్నం, అశోక్, వినయ్, మదుసాని సిద్ధు పాల్గొన్నారు.

చౌకబారు ప్రకటనలు మానుకోవాలి



మాట్లాడుతున్న నాయకులు

వరంగల్: 14వ డివిజన్ అభివృద్ధికి కృషిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్‌పై ఇతర పార్టీల నాయకులు చేస్తున్న చౌకబారు ప్రకటనలు మానుకోవాలని డివిజన్ కాంగ్రెస్ నాయకుడు అడుప మహేష్, ఎన్టీఆర్ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్ సూచించారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమమావేశంలో వారు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం రెండేళ్లకు ఒకసారి నూతన కమిటీలను ఎన్నుకుంటున్నట్లు తెలిపారు. గత కమిటీలో అధ్యక్షుడిగా ఉన్న మహిళ భర్త పోవడంతో బీజేపీకి చెందిన ఓ మహిళ మరికొంత మంది మహిళలను కూడగట్టుకుని ఇంతేయాజ్ లక్ష్యంగా ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్‌నగర్ గ్రామ అభివృద్ధి కమిటీ నాయకులు కొత్తపెల్లి యాదగిరి, ఈర్ల రాజు, డాక్టర్ రాజేందర్, భిక్షపతి, అంజయ్య, రమేష్‌రెడ్డి, హరిబాబు, ఎస్కే సైజాజీ, ఎలేంద్ర, నాగలక్ష్మి, నజీమా, సరిత, పుష్ప, కళావతి, శోభ, రజిత తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కెనాల్‌లోకి దూసుకెళ్లిన ఇసుక లారీ



హసన్‌పర్తి: హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారిలోని అన్నాసాగరం సమీపంలో ఉన్న ఎస్సారెస్పీ కాల్వలోకి ఆదివారం ఓ ఇసుక లారీ దూసుకెళ్లింది. ఈ సంఘటనలో లారీ డ్రైవర్‌కు బలమైన గాయాలయ్యాయి. ఈమేరకు లారీ యజమాని ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం ములుగు జిల్లా మంగపేట మండలం నుంచి ఇసుక లోడ్‌తో హసన్‌పర్తి మీదుగా సంగారెడ్డి వైపునకు వెళ్తున్న క్రమంలో ఎస్సారెస్పీ కాల్వ వద్ద లారీ అదుపు తప్పి కెనాల్‌లోకి దూసుకెళ్లింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

గుర్తు తెలియని మహిళ మృతి



ఎంజీఎం మార్చురీలో భద్రపర్చిన మృతదేహం

ఖిలా వరంగల్: మతిస్థిమితం కోల్పోయిన ఓ వృద్ధ మహిళ అనారోగ్య సమస్యలతో వరంగల్ ఓసిటీలో శనివారం సాయంత్రం కిందపడి పోయింది. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందగా, వైద్యుల సూచనల మేరకు మిల్స్ కాలనీ పోలీసులు ఎంజీఎం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి వివరాల కోసం 87126 85006 నంబర్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం సూచించారు.


భూ ఆక్రమణకు యత్నం

దేశాయిపేట: దేశాయిపేటలోని సర్వే నంబర్ 306, 607లలోని 368 గజాల స్థలాన్ని ఆక్రమించేందుకు హద్దులుగా ఉన్న సిమెంట్ దిమ్మెలను సిలువేరు మోహన్‌బాబు, సిలివేరు గిరిబాబు, సిలివేరు వినయ్ తొలగించారని జన్ను జయరావు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపారు.

మెట్లబావి సందర్శన

ఖిలా వరంగల్: చారిత్రక ప్రసిద్ధి చెందిన శివనగర్‌లోని మెట్లబావి (రాణిరుద్రమ దేవి స్నానాల బావి)ని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె స్వరూప్ రెడ్డి, తదితరులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అద్భుతమైన నిర్మాణంతో కూడిన మెట్ల బావిని తిలకించారు.

అయ్యప్పస్వామికి విభూదితో అభిషేకం



కాజీపేట: కాజీపేట పట్టణంలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామికి గురుస్వాముల శరణుఘోషల మధ్య ఆదివారం విభూదితో అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు అయినవోలు సాయికృష్ణ శర్మ, ఉడుతల శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి మహార్చన జరిపించి ప్రత్యేకంగా అలంకరించారు. మాలాధారులతో సహస్రనామ పారాయణం, గణపతి సహస్రనామ పారాయణం, సుబ్రహ్మణ్య అష్టోత్తరం, హారతి, మంత్రపుష్పం జరిపించారు. పూజలో అయ్యప్ప గురుస్వాములు బుర్ర జనార్దన్ గౌడ్, పిల్లల కుమారస్వామి, అరూరి సాంబయ్య, కోటగిరి సంపత్ కుమార్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను బీఆర్ఎస్ మోసం చేసింది

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీ, నాయకులు

మడికొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55,143 ఉద్యోగాలను భర్తీ చేసిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మడికొండ శివారులోని ఓ కన్వేషన్ హాల్‌లో జరిగిన స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే డీఎస్సీ ద్వారా 11వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేసిందని తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నియోజకవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేశారన్నారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణం, డిగ్రీ కళాశాల నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ కార్యాలయ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, పార్టీ జనగామ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎరుకల సమస్యలపై చర్చించాలి



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

- తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోనికి రాజు

హన్మకొండ: ఎరుకల సమస్యలపై అసెంబ్లీ, శాసన మండలిలో చర్చించాలని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోనికి రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి ఆదివాసీ ఎరుకల సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం రాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా ఆదివాసీ ఎరుకల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ములుగు జిల్లా రామాంజపురం గ్రామంలో కాకతీయ రాజులు 8 వందల ఏళ్ల క్రితం నిర్మించిన ఎరుకల నాంచారమ్మ పంచకూటాలయాన్ని పునర్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు లోనికి సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి మానుపాటి రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేతిరి రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

వివాహాల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

- ఐద్వా జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల



సదస్సులో మాట్లాడుతున్న రత్నమాల

ఖిలా వరంగల్: కులాంతర, మతాంతర వివాహాల రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, కానిస్టేబుల్ నాగమణిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ డిమాండ్ చేశారు. వరంగల్ శివనగర్ రఘునాథ్ భవనంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్), అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉసిల్ల కుమార్, భవాని అధ్యక్షతన సంతాప, సంఘీభావ సదస్సును ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతం కేంద్రంగా పరిపాలన చేస్తూ, రాజ్యాంగ మౌలిక పునాదులను కూల్చేందుకు యత్నిస్తోందని విమర్శించారు. దళితుల ఐక్యతను సాధించడమే అంబేడ్కర్‌కు తామిచ్చే నిజమైన నివాళి అని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎలిషా, అనిత, బాబు, రాముల, దివ్య, శ్రీలత, సాయిలు, ఎలిజబెత్, లక్ష్మి, కమల, రూప తదితరులు పాల్గొన్నారు.

ఆ రోజులు.. ఆనాటి జ్ఞాపకాలు



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

- ఘనంగా 1984 –85వ బ్యాచ్ సమ్మేళనం

వరంగల్ చౌరస్తా: దుర్గేశ్వర స్వామి దేవాలయ సమీపంలోని ఆర్య బాలురు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి వరంగల్ రైల్వే – ఆర్టీసీ బస్ స్టేషన్‌కు సమీపంలోని కన్వెన్షన్ హాల్ ఆదివారం వేదికగా మారింది. 1984 – 85వ సంవత్సరంలో పదో తరగతి పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి ఒకచోట చేరి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పరస్పరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ సభ్యులు సుధాకర్, వెనిశెట్టి వెంకటేశ్వర్లు, అంజన్ కుమార్, శ్రీనివాస్, దర్శన్ కుమార్, సదానందం, శంకర్, టీవీఎస్.చారి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఖిలా వరంగల్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కూరపాటి డాక్టర్ రమేష్, డాక్టర్ కూరపాటి రాధిక, మాజీ కార్పొరేటర్ బాసాని శ్రీనివాస్ సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులను దూరం చేయవచ్చని అన్నారు. కూరపాటి ఆస్పత్రి ఆధ్వర్యంలో వరంగల్ 39వ డివిజన్ ఏకశిల నగర్‌లో ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజు సహకారంతో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రదీప్, ఫిజీషియన్ డాక్టర్ దీప, సిబ్బంది పాల్గొన్నారు.